
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY







పాంబండ ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


## పాంబండను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

**» సీఎంకు లేఖ రాసిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**

కులకచర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాంబండ ఆలయాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఐఎఫ్ఎస్ అధికారి కృష్ణతో కలిసి సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి సుందరీకరణ పనులు చేపట్టేందుకు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాంబండను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. దేవాదాయ శాఖకు రూ.80 కోట్ల ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అనుమతులు రాగానే విడతల వారీగా పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, ఆలయ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి వనరులను పెంపొందించాలి

**» బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్**



సీఎంకు పంపిన లేఖను ప్రదర్శిస్తున్న రమేశ్

తాండూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగు నీటి వనరులను పెంపొందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ కోరారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి పరిగికి నీళ్లు అందించాలని, కాగ్నా నదిపై ప్రాజెక్టు రూపకల్పన, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తాండూరు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గురువారం తాండూరులో విలేకరులతో మాట్లాడుతూ కోట్‌పల్లి ప్రాజెక్టుల మరమ్మత్తులు చేపట్టాలని, యాలాల మండలంలో శివసాగర్ ప్రాజెక్టును పూర్తి చేయాలని, మూసీ పరివాహక రైతులను మేలు జరిగేలా చేయాలని డిమాండ్ చేశారు. కాగ్నా జలాలు వృథాగా కర్ణాటకకు తరలకుండా ఆరు టీఎంసీల రిజర్వాయర్‌ను నిర్మించాలని కోరారు. చిన్న తరహా ప్రాజెక్టుల నిర్వాహణపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో 9,200 ఎకరాల ఆయకట్టు గల కోట్‌పల్లి మధ్య తరహా ప్రాజెక్టును 14,000 ఎకరాల ఆయకట్టుకు పెంచాలని డిమాండ్ చేశారు.




# జీపీవోలు వచ్చేస్తున్నారు

## జిల్లాకు 163 మంది కేటాయింపు

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రామ పాలన అధికారుల(జీపీవో) నియామకాలకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. నేడు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. జిల్లాకు మొత్తం 163 మంది జీపీవోలను కేటాయించారు. నియామకపత్రాలు అందుకునేందుకు వీరిని ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

### స్థానికులు 137 మంది, ఇతరులు 26 మంది

### హైదరాబాద్‌కు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు

### నేడు సీఎం చేతులమీదుగా నియామకపత్రాల పంపిణీ

వికారాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నియామకపత్రాల కోసం జీపీవోలను హైదరాబాద్‌కు తరలించేందుకు తాండూరు, వికారాబాద్ నుంచి బస్సులు ఏర్పాటు చేశారు. తాండూరు నుంచి ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరనుండగా 10 గంటలకు వికారాబాద్ నుంచి బస్సు బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలలోపు హైటెక్స్‌కు చేరుకుంటారు. ఒక్కో బస్సుకు నాయబ్ తహసీల్దార్‌ను నోడల్ అధికారిగా నియమించారు. మొదట జీపీవోలకు నియామక పత్రాలు అందజేసి ఆ తర్వాత జిల్లాలో కలెక్టర్ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

**163 మంది జీపీవోలు**

జిల్లాలో 236 రెవెన్యూ క్లస్టర్లు ఉన్నాయి. జిల్లాలో రెండు విడతల్లో నిర్వహించిన జీపీవో పరీక్షలకు 200 మంది హాజరుకాగా, వారిలో 140 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో 137 మంది జీపీవోలను వికారాబాద్ జిల్లాకు కేటాయించగా, జిల్లాకు చెందిన ముగ్గురిని ఇతర జిల్లాలకు కేటాయించారు. కాగా, ఇతర జిల్లాల నుంచి 26 మంది జీపీవోలు

మిగతా 6వ పేజీలో...

### ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం



జిల్లాకు 163 మంది గ్రామ పాలన అధికారులను ప్రభుత్వం కేటాయించింది. జీపీవోలుగా ఎంపికైన వారు నేడు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకోనున్నారు. ఎంపికైన జీపీవోలను హైదరాబాద్ తరలించేందుకు రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. జీపీవోలతో సమన్వయం చేసుకుని వేదిక వద్దకు చేర్చే బాధ్యతను నోడల్ అధికారిగా నాయబ్ తహసీల్దార్‌కు అప్పగించాం.

- జి.లింగ్యానాయక్, అదనపు కలెక్టర్(రెవెన్యూ), వికారాబాద్

## హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్

**మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**



వికారాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్ అని, అవినీతి పరుడు కాదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. పార్టీని బలపర్చడమే హరీశ్‌రావు లక్ష్యమని పేర్కొన్నారు. కవిత వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందని, ఆమెను ప్రేరేపించి కేసీఆర్ కుటుంబాన్ని చీల్చాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హరీశ్‌రావు తెలంగాణ ఉద్యమ సమయంలో పదవులు పట్టించుకోకుండా ప్రజల కోసం పోరాడారని, కేసీఆర్‌కు ఎల్లప్పుడూ అండగా నిలిచారని పేర్కొన్నారు. జోగినిపల్లి సంతోష్‌కుమార్ ఎప్పటికీ కేసీఆర్‌కు నమ్మకమైన నాయకుడని, వారి మీద ఆరోపణలు చేయడం అనవసరమని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను హరీశ్ రావు ఆధారాలతో తిప్పికొడుతున్నారని, అందుకే ఆయనపై ప్రతిపక్షం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. రాజకీయ ఉచ్చులో పడితే భవిష్యత్తు అంధకారమవుతుందని కవిత గుర్తించాలన్నారు.

## నేడు రేషన్ షాపులు బంద్

కీసర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రేషన్ షాపులు బంద్ చేస్తున్నట్లు మేడ్చల్ జిల్లా రేషన్ డీలర్ల కార్యనిర్వాహక అధ్యక్షుడు తటాకం వెంకటేష్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. డీలర్లకు రూ.5,000 గౌరవ వేతనం, రూ.300 కమీషన్, ఐదు నెలలుగా కమిషన్ విడుదల చేయనందున రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేశ్ బాబు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా రేషన్ షాపులు సంపూర్ణ బంద్ పాటిస్తున్నట్లు వివరించారు.

## మోడల్ స్కూల్‌కు మంచి రోజులు

బషీరాబాద్ ఆదర్శ పాఠశాలకు
రూ.5లక్షలు మంజూరు
హాస్టల్ అసంపూర్తి పనులకు మోక్షం
5



కళా ఉత్సవ్ ముగింపు కార్యక్రమంలో డీఈవో విజయకుమారి, విద్యార్థులు

## కళలను ఆదరించాలి

**» డీఈవో విజయకుమారి**

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కళలను ఆదరించాలని జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫైన్‌ఆర్ట్స్ పాఠశాలలో గురువారం నిర్వహించిన కళా ఉత్సవ్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళల పట్ల ఆసక్తి చూపాలని, భారతీయ సంస్కృతి సంప్రదాయాలు చాలా గొప్పవని పేర్కొన్నారు. లలిత కళలను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ హేమలత, ప్రోగ్రాం ఇన్‌చార్జి రాధిక పద్మజా, ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

## హద్దురాళ్ల తొలగింపు



హద్దురాళ్లను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఘట్‌కేసర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఎఫ్‌టీఎల్‌లో అక్రమ లేఅవుట్' అంటూ ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని చందుపట్లగూడ పులిచరకుంటలో ఎలాంటి అనుమతులు లేకుండానే లేఅవుట్‌ను నిర్మించారు. ఐదు సంవత్సరాల క్రితమే లేఅవుట్ పనులు చేపట్టడంతో అప్పట్లో అధికారులు స్పందించి చర్యలు చేపట్టడంతో పనులు నిలిపివేశారు. 20 రోజులుగా నిత్యం ఏదో ఒక సమయంలో హద్దు రాళ్లు పాతుతూ ఎట్టకేలకు పనులను పూర్తి చేశారు. ఆంధ్రజ్యోతి సమాచారం సేకరించి మున్సిపల్ కమిషనర్ వివరణ కోసం ఫోన్ చేసిన గంటకే గురువారం చీకటి పడే సమయానికి ఎక్స్‌కవేటర్‌తో మున్సిపల్ సిబ్బంది హద్దురాళ్లను తొలగించారు.



## గణనాథుడికి స్పీకర్ ప్రత్యేక పూజలు

వికారాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్ పట్టణంలో బుధవారం రాత్రి, గురువారం మధ్యాహ్నం పర్యటించారు. ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన గణనాథుల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్పీకర్ రాకతో ఆయా వార్డుల ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఘనంగా సన్మానించారు. స్పీకర్‌తో ఫొటోలు దిగేందుకు కాలనీవాసులు పోటీపడ్డారు. స్పీకర్ వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు జాదవ్‌తో సంతోశ్

## కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా..

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి అహర్నిషలు పాటుపడుతానని భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యదర్శి వేలూరి సంతోశ్ అన్నారు. బీజేఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు జాదవ్ సంతోశ్‌కు నియామక పత్రాన్ని అందేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి ముందుండి పోరాడే ఏకైక కార్మిక సంఘం బీజేఎంఎస్ అన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

# దారిమళ్లిన యూరియా!

## ముంబై నుంచి దొడ్డిదారిన పరిగికి రవాణా



లారీలో యూరియా బస్తాలను పరిశీలిస్తున్న పోలీసులు, వ్యవసాయాధికారులు

**పంటలకు వాడే యూరియా పరిశ్రమలకు.. 600 బస్తాలతో వెళ్తున్న లారీ పట్టివేత**

**శాంపిల్స్ సేకరించిన అధికారులు**

పరిగి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా యూరియాతో రైతాంగం తల్లడిల్లుతుంటే, మరో వైపు దొడ్డిదారిన యూరియాను పరిశ్రమలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా అక్రమంగా తరలిస్తున్న యూరియా లారీ పట్టుబడడం అనుమానాలకు తావిస్తోంది. పట్టుబడిన యూరియా పరిశ్రమలకే వినియోగిస్తారని అధికారులు చెబుతుండగా, పంటల సాగుకు వినియోగించే యూరియాను బస్తాలు మార్చి పరిశ్రమలకు తరలిస్తున్నారని

మిగతా 6వ పేజీలో...

### భారీగా బ్లాక్ మార్కెట్‌కు..

కొన్నేళ్లుగా యూరియాను పరిగి నుంచి యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపణలున్నాయి. పరిగి పట్టణంలో దాదాపు 30 ఎరువుల దుకాణాలు ఉండగా ఇందులో పేరుమోసిన కొందరు వ్యాపారస్తులు కొందరు అధికారుల సహకారంతో ఎరువుల బ్లాక్ మార్కెట్ దందా నిర్వహిస్తున్నారు. పరిగి మండల శివారుల్లో ఉన్న కొన్ని ఫ్యాక్టరీలకు వందలకొద్దీ టన్నుల యూరియా అవసరమని, అందుకే కొన్నేళ్లుగా యూరియా అక్రమ రవాణా అవుతోందని స్థానికులు వాదిస్తున్నారు. యూరియా కొరతతో ఫ్యాక్టరీల యజమానులు రెట్టింపు ధరలకు యూరియాను కొని రాత్రి వేళల్లో తరలిస్తున్నట్లు సమాచారం. విజిలెన్స్ అధికారుల తనిఖీలు నామమాత్రంగానే ఉండడంతో యూరియా కొరత ఏర్పడుతుందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## రైస్‌మిల్లు యజమానులు నిబంధనలు పాటించాలి

**» జిల్లా సివిల్ సప్లై అధికారి సుగుణాబాయి**



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న సుగుణాబాయి

శామీర్‌పేట, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లుల యజమానులు ప్రభుత్వ నిబంధలను ఖచ్చితంగా పాటించాలని, ఏ మాత్రం అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ జిల్లా సివిల్ సప్లై మేనేజర్ సుగణాబాయి హెచ్చరించారు. గురువారం మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్ పరిధిలోని వెంకటరమణ రైస్‌మిల్లును ఎఫ్‌సీఐ, విజిలెన్స్ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి రైస్ మిల్లులో ఎలాంటి అవకతవకలు, తేడాలు లేవని చెప్పారు. రైస్ మిల్లు యజమానులకు పలు సూచనలు చేశారు. సీఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

## ఉత్తమ సేవలకు గుర్తింపు



**» 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక**

వికారాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 50 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ఇందులో ఒక జీహెచ్ఎం, ఒక ప్రిన్సిపాల్, 16 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు పీడీలు, ఇద్దరు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, 25 మంది ఎస్‌జీటీలు, ఒక పీఈటీ, ఒక పీజీటీ, ఇద్దరు సీఆర్‌టీలు ఉన్నారు.

**నేడు ఉపాధ్యాయులకు సన్మానం**

జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి జి.రేణుకాదేవి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఇతర

మిగతా 6వ పేజీలో...



మాట్లాడుతున్న ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

ఆమనగల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పనిచేస్తుందని ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు అన్నారు. సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగాలని కోరారు. ఆమనగల్లులోని వేంకటనర్సింహ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఆమనగల్లు బ్లాక్‌స్థాయి సమావేశాన్ని బ్లాక్ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి సైదులు, ఆహ్వాన కమిటీ చైర్మన్ సిల్వర్‌సురేశ్‌లు హాజరయ్యారు. సురేశ్ మాట్లాడుతూ ఈ నెల 26న కందుకూరులో రంగారెడ్డి జిల్లా మూడో మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ గణేశ్, జిల్లా కమిటీ సభ్యులు యూనుస్, కోట్ల వెంకటేశ్, నర్సింహ్మా, చంద్రశేఖర్, చంద్రశేఖర్, తిరుపతి, శేఖర్, శ్రీను, తిరపతయ్య, రాజు, యాదగిరి, హఫీజ్, జంగయ్య పాల్గొన్నారు.

### బ్లాక్ స్థాయి సమన్వయ కమిటీ...

జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు ఆమనగల్లు బ్లాక్ స్థాయి సమన్వయ కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యూనుస్, సభ్యులుగా డి. శంకర్, నర్సింహ, చంద్రశేఖర్, చాట్ల యాదగిరి, తిరుపతి, చంద్రకుమార్, మహేశ్‌లు ఎన్నికయ్యారు. వీరు మహాసభల పనులను పర్యవేక్షిస్తారు.

## లైంగికదాడి కేసు.. నిందితుడికి 20ఏళ్ల జైలు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అత్యాచారం, కిడ్నాప్ కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మేడ్చల్ స్పెషల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జి ఎస్.అమరావతి గురువారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అల్వాల్ పీఎస్ పరిధిలో కిడ్నాప్, అత్యాచారం కేసులో నిందితుడిని మేడ్చల్ స్పెషల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన జడ్జి నిందితుడు అద్దాల నాని(23)కి 20ఏళ్ల జైలు, 20వేల జరిమానా విధించారన్నారు. అలాగే బాధితురాలికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని తీర్పిచ్చారని వివరించారు.



# పార్కు స్థలాలకు రక్షణ కరువు

- పరిగిలో 29 పార్కు జాగల గుర్తింపు
- కూలిన ప్రహరీలు, తుప్పు పట్టిన గేట్లు
- దొంగలపాలైన గ్రిల్స్, స్టీల్ పైపులు
- స్థలాల పరిరక్షణను పట్టించుకోని మునిసిపల్ అధికారులు



పరిగి మైత్రీనగర్‌లో అలనా, పాలన కరువైన పట్టణ ప్రకృతి వనం



పట్టణంలో ఓ వార్డులో కూలిన పార్కు గోడలు

పరిగి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపాలిటీ పరిధి పార్కులకు రక్షణ కరువైంది. స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న పరిగి పట్టణం ఏటికేడు విస్తరిస్తోంది. పట్టణంలో కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. అయితే వెంచర్లలోని పార్కు స్థలాలకు ప్రహరీలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం లేదు. 15 వార్డుల్లో ఐదారేళ్ల నుంచి వెలసిన కాలనీల్లో 29చోట్ల పార్కు స్థలాలను గుర్తించారు. వీటిలో మూడింటిలోనే మొక్కలు పెంచుతున్నారు. మొక్కలకు ఫెన్సింగ్ లేక పశువులు, మేకలు మేస్తున్నాయి. కొన్ని పార్కులకు పైపులతో ప్రహరీ, ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేసినా అవి ధ్వంసమయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లేక పార్కు జాగాలు కబ్జా అవుతున్నాయి. ప్రహరీలు కూలుతున్నాయి. ప్రహరీల పైపులు, గ్రిల్స్‌ను ఎత్తుకపోతున్నారు. పరిగిలోని తిరుమల, మైత్రీ వెంచర్లలోని పార్కుల్లో పైపులు, గ్రిల్స్ అపహరించారు. మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి వదిలేశారు. 29చోట్ల పార్కు స్థలాలున్నట్లు రికార్డుల్లో ఉన్నా పదిలోపు స్థలాలకు మాత్రమే ఫెన్సింగ్ వేశారు. మిగతా వాటికి ఏ రక్షణా లేదు. వెంచర్లు వేసిన సమయంలో అధికారులు తగిన చర్యలు తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి తగిన రక్షణ ఏర్పాట్లు చేస్తే పార్కు స్థలాలకు భద్రత ఉండేది. వెంచర్లలో పార్కు స్థలాలకు రక్షణ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో అవి కబ్జాల పాలవుతున్నాయి. ఇప్పటికైనా వెంచర్ ప్లానింగ్‌లో వదిలిన ప్రకారం పార్కు స్థలాలకు ప్రహరీలు, ఫెన్సింగ్ వేసి పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### పార్కు స్థలాలకు ఫెన్సిగ్ వేసేందుకు చర్యలు



పరిగి మునిసిపల్ పరిధిలో 29 చోట్ల పార్కు స్థలాలను గుర్తించాం. మూడు చోట్ల మొక్కలు పెంచుతున్నాం. మరో మూడు చోట్ల చదును చేశారం. పార్కు జాగాల గ్రిల్స్ పైపుల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాం, పార్కు స్థలాలన్నింటికీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం

- వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్,పరిగి

## ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలి



అనురాగ్ యూనివర్సిటీ ఏఐ వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన, నైతికమైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగంపై దృష్టి సారించాలని సీఎస్ఐ సభ్యుడు కల్యాణ్ సర్వేపల్లి అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ విభాగం విభాగం నిర్వహించిన వర్క్‌షాప్‌నకు గురువారం ఆయన హాజరై మాట్లాడారు. రాబోవు కాలంలో ఏఐ ప్రభావం సమాజంపై చాలా ఉంటుందన్నారు. మంచి సమాజ నిర్మాణం కోసం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వినియోగించాలన్నారు. ఏఐలో నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. లక్ష్య ఆధారిత వ్యవస్థ నిర్మాణంలో ఏఐ ఏజెంట్ వినియోగించుకోవాలని తెలిపారు. వర్క్‌షాప్‌లో 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీన్‌లు విజయ్‌కుమార్, మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఉప సభాపతి హరీశ్వర్‌రెడ్డికి ఘన నివాళి



హరీశ్వర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహేశ్‌రెడ్డి, తదితరులు

పరిగి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ ఉప సభాపతి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ నాయకులు హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ద్వితీయ వర్ధంతి క్రియలను ఆయన తనయుడైన మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితుడు సిద్ధాంతి పార్థసారథి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. రాజకీయ దురంధుడు, సీనియర్ నేత హరీశ్వర్‌రెడ్డి రాజకీయాల్లో అందరివాడిగా పేరుప్రతిష్ఠలు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. హరీశ్వర్‌రెడ్డి తన రాజకీయాల్లో 'కోపం' పదమే తెలియని నేతగా ముద్ర వేసుకున్నారని అన్నారు. నేటి నాయకులకు ఆయన స్ఫూర్తిదాయకమని కీర్తించారు. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేవారన్నారు. కష్టాల్లో తానున్నానని వెన్నుతట్టి నిలిచిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బంది అభివృద్ధికి చర్యలు



మున్సిపల్ సిబ్బందికి రెయిన్ కోట్లను అందజేస్తున్న రాధికాగుప్తా

ఘట్‌కేసర్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సిబ్బంది అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల) రాధికా గుప్తా అన్నారు. గురువారం ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజేష్ అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజని, ఏఈ రాకేష్, మేనేజర్ సతీష్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా బాలాజీ



చేవెళ్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పరిధి దామరిగిద్ద యూపీఎస్ ఉపాధ్యాయుడు కె.బాలాజీ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డుకు ఎంపిక చేశారు. తోటి టీచర్లు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు



క్రీడాకారులకు బహుమతులిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించే వారికి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎదులాబాద్ జెడ్పీ పాఠశాలలో జరిగిన జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతాప్‌సింగారం పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. గురువారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు సునీత, కృష్ణమహరాజ్, సత్యనారాయణ, నాయకులు కుమార్, నర్సింహగౌడ్, ముత్తయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఫెన్సర్లకు షట్లర్ జ్వాల చేయూత



క్రీడాకారులతో గుత్తా జ్వాల

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రతిభావంతులైన యువ ఫెన్సింగ్ క్రీడాకారులకు దిగ్గజ షట్లర్, తెలంగాణ ఫెన్సింగ్ సంఘం అధ్యక్షురాలు గుత్తా జ్వాల అండగా నిలిచారు. గురువారం మొయినాబాద్‌లోని తన నివాసంలో ఫెన్సింగ్ క్రీడాకారులకు ఉచితంగా స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. వీరు ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్యాడెట్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. ఫెన్సింగ్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని జ్వాల తెలిపింది. కార్యక్రమంలో రాష్ట్ర ఫెన్సింగ్ సంఘం కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి సందీప్‌జాదవ్ పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోయి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లులోని శ్రీ లక్ష్మీగార్డెన్‌లో గురువారం మున్సిపాలిటీ, మండల కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను ఎమ్మెల్యేకు తెలియపర్చారు. పార్టీ కోసం పనిచేసే వారికే పార్టీ, నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు ఇవ్వాలని, స్థానికంగా పార్టీ నాయకత్వాన్ని మార్చాలని, గెలిచే వారికే టికెట్లు ఇవ్వాలని, కార్యకర్తల మనోభావాలను గౌరవించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కంకణబద్ధులు కావాలన్నారు. అసత్య ప్రచారం, అబద్ధ పునాదులపై రాజకీయాలు సాగించేవారు ఎక్కువ కాలం మనలేరన్నారు. పార్టీ నిబంధనల ప్రకారం కార్యకర్తలు నడుచుకోవాలన్నారు. ప్రజాభిమానం ఉన్న వారికే స్థానిక ఎన్నికల్లో పార్టీ అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. ఆమనగల్లులో డివిజన్ కార్యాలయాల ఏర్పాటు, జూనియర్ కళాశాల నిర్మాణం, జంగారెడ్డిపల్లి- చంద్రాయన్‌పల్లి బీటీ రోడ్డు వెడల్పు, పాత రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి రూ.15 కోట్లు మంజూరు చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని నారాయణరెడ్డి తెలిపారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల, మున్సిపల్ అధ్యక్షులు జగన్, మానయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, మాజీ ఎంపీపీలు ధనుంజయ్య, అనితవిజయ్, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నారాయణ, కల్లు రమణారెడ్డి, సత్యం, శ్రీను, దశరథం, అంజన్‌రెడ్డి, జిల్ల శీను, కాలె మల్లయ్య, కె.శ్రీధర్‌రెడ్డి, జంగయ్య, శ్రీశైలం జంగయ్య, శ్రీకాంత్, ఫరీద్, బాల్‌రెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

### స్థానిక ఎన్నికల అనంతరం విపక్షాలు కనుమరుగు

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం విపక్షాలు కనుమరుగేనని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజారంజక పాలనతో తమకు భవిష్యత్తు లేదనే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆమనగల్లు 5వ వార్డుకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం ఏఎంసీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనాదక్షత, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో వస్పుల శేఖర్, గురవయ్య, అనిల్, రాజు, శివ, రాకేశ్, సా యి, యాదగిరి, ప్రశాంత్, చంద్రయ్య ఉన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

## బీమాపై జీఎస్టీ తొలగింపుతో పాలసీదారులకు ఊరట

వికారాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీమా పాలసీ అందరికీ అవసరమని, బీమా పాలసీలపై జీఎస్టీని తొలగించడం పాలసీదారులకు ఊరట కలిగించనుందని లియాఫీ వికారాబాద్ ఎల్ఐసీ బ్రాంచ్ అధ్యక్షుడు కిచ్చన్నగారి వెంకట్‌రెడ్డి అన్నారు. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తొలగింపు ప్రకటన పురస్కరించుకుని గురువారం ఎల్ఐసీ కార్యాలయంలో లియాఫీ ఆధ్వర్యంలో ఏజెంట్లు, పాలసీదారులు కార్యాలయం సిబ్బందితో కలిసి కేట్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జీవిత, ఆరోగ్య బీమాలపై జీఎస్టీ తొలగించడాన్ని స్వాగతిస్తూ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బీమా పాలసీలపై జీఎస్టీ తొలగింపు కోసం అవిశ్రాంతంగా కృషిచేసిన తమ నాయకుల సమష్టి కృషిఫలితమే ఈ విజయమన్నారు. జీఎస్టీకి వ్యతిరేకంగా నుంచి లియాఫీ-1964సంఘం పోరాటం చేసిందన్నారు. లియాఫీ జాతీయ నేతలు ఎస్‌వీ శ్రీనివాసచారి, సింగారపు శ్రీనివాస్, పూరి వెంకటేశం, బీఎస్‌చారిల ఆధ్వర్యంలో చేసిన అనేక పోరాటాలతోనే జీఎస్టీ తొలగింపు ప్రకటనొచ్చిందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి విజయేందర్, కోశాధికారి పాండు, కన్వీనర్ కృష్ణకుమార్, విజయభాస్కర్‌రెడ్డి, కేఎస్‌ఎన్‌రెడ్డి, రాధాబాయి, భాగ్య, రమాదేవి, సంతోష, ప్రభులింగం, యాదయ్య, విక్రమ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, అనంతరెడ్డి, దివాకర్, హరిచందర్ పాల్గొన్నారు.



జీఎస్టీ తొలగింపును హర్షిస్తూ అభివాదం చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు, సలహాదారులు

# యూరియా కోసం తండ్లాట


కులకచర్ల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద రైతులు

**రైతులకు సరిపడా అందని ఎరువు**

షాద్‌నగర్/కులకచర్ల/ఆమనగల్లు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు పాట్లు పడుతున్నారు. పొద్దు పొడవకముందే ప్రాథమిక సహకార సంఘాలు, గ్రోమోర్ ఆగ్రో కేంద్రాలు, ఫెర్టిలైజర్ షాపుల వద్దకు చేరుకొని లైన్ కడుతున్నారు. వస్తున్న ఒకటీ అరా యూరియా లోడ్లు రైతులకు సరిపోవడం లేదు. ఒక్కో రైతుకు ఒకటి, రెండు బస్తాల చొప్పున ఇస్తూ పంపిస్తున్నారు. చాలా మంది రైతులు ఉత్తి చేతుల్తోనే ఇళ్లకు వెళ్తున్నారు. తమకు యూరియా ఇవ్వవలసిందేనని దుకాణదారులతో గొడవపడుతున్నారు. వచ్చిన స్టాకును టోకెన్లు ఇచ్చి పోలీసుల పర్యవేక్షణలో పంపిణీ చేస్తున్నారు. పంటలకు యూరియా వేసే అదును దాటిపోతోందని, ఇప్పుడు వేయకుంటే దిగుబడి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా పొందేందుకు రైతుల మధ్య తోపులాటలు, గొడవలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వం రైతులకు సరిపోడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. షాద్‌నగర్‌లోని కేశంపేట రోడ్డులో సొసైటీ వద్ద గురువారం ఉదయం యూరియా కోసం రైతులు బారులు తీరారు. గత నెల 28, 29వ తేదీల్లో యూరియా పంపిణీకి కొందరికి స్లిప్పులు ఇచ్చారు. కానీ ఇప్పటికీ యూరియా ఇవ్వడం లేదని రైతులు సిబ్బందిపై విరుచుకుపడ్డారు. తమకే ముందు ఇవ్వాలని వాగ్వాదానికి దిగారు. కాగా ప్రతీ రైతు బయోమెట్రిక్ తీసుకుంటుండడంతో యూరియా పంపిణీలో జాప్యం అవుతోందని సిబ్బంది తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లికి చెందిన మహిళా రైతు సుగుణ(65) పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ షాపు వద్ద ఉదయం 5:30 నుంచి నిరీక్షించింది. కులకచర్లలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 220 బస్తాల యూరియా వచ్చింది. పోలీసు భద్రత మధ్య ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. చాలా మంది ఉత్త చేతుల్తో వెనుదిరిగారు. వరి నాటి నెల దాటినా యూరియా చల్లలేదని రైతులు తెలిపారు. యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని బీఆర్ఎస్ ఆమనగల్లు మునిసిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ అన్నారు. యూరియా కోసం రైతులు నిత్యం వేదన పడుతున్నా ప్రభుత్వాల్లో చలనం లేదని మండిపడ్డారు. ఆమనగల్లులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు, రైతులు హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఆఫీసు చేరుకొని ధర్నా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వస్పుల సాయిలు, పంతూనాయక్, నిరంజన్‌గౌడ్, నాగిల్ల జగన్, మహేశ్, గణేశ్, యాదయ్య, గణేశ్, సోమ్లా, శ్రీకాంత్, దేవేందర్, కృష్ణవేని, లలిత, శివ, విమలమ్మ పాల్గొన్నారు.


షాద్‌నగర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు


యూరియా ఇవ్వడం లేదని స్లిప్పులు చుపుతున్న అన్నదాతలు


ఆమనగల్లు : ధర్నాలో మాట్లాడుతున్న పత్యానాయక్


మురళీనగర్‌లో కూలీల సమస్యలు తెలుసుకుంటున్న బాల్‌రాజ్

## 'ఉపాధి' పని దినాలు పెంచాలి

కందుకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు పనిదినాలను పెంచి, కూలిని సకాలంలో చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గురువారం మురళీనగర్‌లో కూలీల సమస్యలను తెలుసుకున్నారు. బీజేపీ ప్రభుత్వం కూలీలకు పనిదినాలను తగ్గించిందని, చేసిన పనికి కూడా సకాలంలో డబ్బులు ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వాలు కార్మికచట్టాలను పటిష్ఠంగా అమలు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు యాదయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

## జీఎస్టీపై కేంద్ర నిర్ణయం ప్రజలకు వరం

» వ్యాపారులను కలిసిన బీజేపీ నాయకులు


వ్యాపారులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను(జీఎస్టీ)పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజలకు వరంగా మారనుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు అన్నారు. షాద్‌నగర్‌లోని వ్యాపారులను గురువారం నాయకులు కలిసి జీఎస్టీ తగ్గింపుతో తగ్గనున్న వస్తువుల ధరలు, వినియోగదారులకు కలిగే ప్రయోజనాలపై చర్చించారు. బీమాపై 18శాతం ఉన్న జీఎస్టీని పూర్తిగా తగ్గించడం ఊరటన్నారు. విద్యార్థులు కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీని తగ్గించిందని తెలిపారు. అలాగే ఆరోగ్యం కోసం కొనుగోలు చేసే వస్తువులతో పాటు ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషన్లు, ఆటోమొబైల్ రంగంపై కూడ జీఎస్టీ తగ్గనుందని తెలిపారు. జీఎస్టీ తగ్గింపు గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కక్కునూరి వెంకటేష్ గుప్తా, టి.విజయ్‌కుమార్, ఎం.మురళి, విజయ పాల్గొన్నారు.

## చెన్నారెడ్డిగూడలో తీజ్ ఉత్సవాలు



మంచాల, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధి చెన్నారెడ్డిగూడలో తీజ్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మూడు రోజులు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం చివరిరోజు మహిళలు మొలకలతో ఊరేగుతూ అమ్మవార్లకు సమర్పించారు. సంప్రదాయ నృత్యాలు అలరించాయి. వివిధ పార్టీల నాయకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ పగడాల యాదయ్య, ప్యాక్స్ చైర్మన్ హన్మంతరెడ్డి, వెంకటేష్ యాదవ్, రమేష్, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరన్‌కోట్ సీసీఐలో ఉత్పత్తి ప్రారంభం

తాండూరు రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కరన్‌కోట్‌లో గల కేంద్ర ప్రభుత్వరంగ సిమెంటు (సీసీఐ)కర్మాగారంలో సిమెంటు ఉత్పత్తులు ప్రారంభమయ్యాయి. 15రోజులుగా ఈ కర్మాగారంలో సిమెంటు కోల్ మిల్లులో మరమ్మతులు చేశారు. కోల్ మిల్లులో బాల్ బేరింగులు దెబ్బతిన్నాయి. దీంతో మోటార్లకు మరమ్మతులు చేశారు. గురువారం నుంచి సిమెంటు ఉత్పత్తి ప్రారంభమైనట్లు కార్మికులు తెలిపారు. ఈ సీసీఐ కర్మాగారం 40సంవత్సరాల క్రితం నెలకొల్పడంతో యంత్రాలన్నీ దెబ్బతిన్నాయని, వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్టు కార్మికులు పేర్కొన్నారు. ఈ సంస్థను మరింత మెరుగుపర్చేందుకు రూ.70కోట్ల నిధులు మంజూరుచేస్తే ఉత్పత్తులకు ఇబ్బంది కలగదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

కొడంగల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వ, ఇతర వాటిపై విజిలెన్స్, జిల్లా పౌరసరఫరాల అధికారులు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, మోహన్‌కృష్ణ, గణపతిరావులు గురువారం తనిఖీలు నిర్వహించారు. కొడంగల్‌లోని వేంకటేశ్వర, గురురాఘవేంద్ర, లక్ష్మీనర్సింహస్వామి రైస్ మిల్లులో ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం నిల్వ వివరాలను అడిగి తెలుసుకున్నారు.


జెండావిష్కరణలో నాయకులు, రైతులు

## సమస్యలు పరిష్కరించమంటే అరెస్టులా?

మొయినాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తే అరెస్టులు చేస్తున్నారని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామమాదవరెడ్డి అన్నారు. గురువారం చిలుకూరులో కిసాన్ సంఘ్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500బోనస్ ఇవ్వడం లేదని, రెండు లక్షల రుణమాఫీ అందరికీ చేయలేదని అన్నారు. వీటిపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.విఠల్‌రెడ్డిని అరెస్టు చేశారన్నారు. తమ సంఘం రైతుల సమస్యలపై పోడుతోందని అన్నారు. పార్టీలు వేరైనా రైతులంతా ఒక్కటేనన్నారు. గ్రామంలో భారతీయ కిసాన్‌సంఘ్ జెండాను ఆవిష్కరించారు.

## స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి సత్తా చాటాలని, గడప గడపకూ పార్టీని తీసుకెళ్లాలని మండల ఎన్నికల కన్వీనర్ కంచుకోట మహేష్ పిలుపునిచ్చారు. నిర్దవెల్లిలో గురువారం ఇంటింటికీ జనజాగరణ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రజారంజక పాలన చేస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహయాదవ్, ఎస్సీ మోర్చా నాయకుడు లింగయ్య, నాయకులు తిరుపతి, కుమారస్వామి, మురళి, శేఖరప్ప, వజ్రలింగం, వెంకటయ్య, సాయి కుమార్, బాలస్వామి, శేఖర్, శ్రీశైలం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీతో ప్రజలకు మేలు

» వికారాబాద్ జిల్లా అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి
» కేసీఆర్ పాలనలో రాష్ట్రం అధోగతి : పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కొడంగల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మెడికల్ కళాశాలలో సీట్ల కేటాయింపు ప్రారంభం కావడంతో వైద్య కళాశాల సిబ్బంది ఉండేందుకు ఎమ్మెల్యే, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, స్థానిక వైద్య సిబ్బంది, నాయకులతో కలిసి పరిశీలించారు. కొడంగల్ నర్సింగ్ కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. మెడికల్ కళాశాల భవనం పూర్తయ్యేంత వరకే తరగతులు తాండూర్‌లో కొనసాగుతాయని తెలిపారు. కళాశాల వైద్యులు, సిబ్బంది కొడంగల్‌లోనే ఉంటూ విద్యాబోధన చేస్తారని తెలిపారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో మెడికల్ సీట్ల కేటాయింపు జరుగుతోందని, రాష్ట్రస్థాయి ఎంపికలో కొడంగల్‌కు 50సీట్లు భర్తీ అవుతాయని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిని పరిశీలించి నిర్మాణ పనులపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. కొడంగల్‌లో 220 పడకల ఆసుపత్రి, తాండూర్ ఆస్పత్రితతో కలిపి 600 పడకలతో మెడికల్ కాలేజీ కొనసాగుతుందన్నారు. పూడూరులో రూ.3వేల కోట్లతో నేవీ రాడార్ స్టేషన్‌ను సీఎం ప్రారంభించారని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు పరిగి మండలం రాకంచర్ల మీదుగా వెళ్తుందన్నారు. వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ సర్వే పూర్తికాగా పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులకు భూసేకరణ చేపట్టామన్నారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ.. ఉస్మానియాకు అనుసంధానంగా కొడంగల్‌లో మెడికల్ కళాశాల కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో ఆస్పత్రి సూపరిండెంట్ చంద్రప్రియ, వైద్యులు సాకేత్, సిబ్బంది, నాయకులు నందారం ప్రశాంత్, కృష్ణంరాజు, ఆసిఫ్ ఖాన్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏ విచారణకైనా సిద్ధం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తన పదేళ్ల పదవీ కాలంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో తాను ఏ విచారణకైనా సిద్ధమేనని అన్నారు. గురువారం షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. తాము తమ పూర్వీకుల నుంచే ఆస్తిపరులమని, ఎమ్మెల్యే కాకముందే తమకు 100 ఎకరాల స్థలం ఉందన్నారు. తమ కుమారులు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారాల ద్వారానే సంపాదించుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తమపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాను ఎమ్మెల్యేగా పదేళ్లలో ప్రజల కోసమే పని చేశానని, ఎవరి వద్దా రూపాయి కూడా లంచం తీసుకోలేదన్నారు. అప్పుడూ, ఇప్పుడూ కూడా తన సంపాదన నెలకు రూ.54వేలు మాత్రమేనని చెప్పారు. తాను బ్యాంకు లోన్ తీసుకునే కారు కొన్నానని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఎంఎస్.నటరాజన్, గణేష్, శ్రీధర్‌రెడ్డి, హఫీజ్, రెడ్డి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీపీవో

పెద్దేముల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇళ్లు మంజూరైన వారు త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని డీపీవో జయసుధ అన్నారు. మంబాపూర్, చైతన్యనగర్ గ్రామాల్లో గురువారం పర్యటించి ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఇళ్ల లబ్ధిదారులకు దశలను బట్టి నిధులు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. పారిశుధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రతన్‌సింగ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనందం పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పేరిట ఇసుక అక్రమ రవాణా


పొలాల్లో ఇసుక డంపులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనుల పేరుతో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. 20ట్రాక్టర్లకుపైగా మహంతీపూర్ నుంచి బొంరాస్‌పేట్, మెట్లకుం, బురాన్‌పూర్ గ్రామాలు, తండాలకు ఇసుక తరలిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ పద్మావతి స్పందిస్తూ ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## పారిశుధ్య పనులను తనిఖీ చేసిన కమిషనర్

తాండూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ కమిషనర్ యాదగిరి శానిటేషన్ పనులను తనిఖీ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు, జవాన్లు శానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు అప్రమత్తంగా ఉండాలని వర్షాభావం దృష్ట్యా తాండూరు పట్టణంలో మురుగు కాల్వలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వివిధ వార్డులో పర్యటించి ఆ వార్డులో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రజలు ఏమైన సమస్యలు ఉంటే తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు పుస్తకంలో నమోదు చేయాలని సూచించారు.

## చేయూత పింఛన్ల పెంపుపై ప్రత్యక్ష యుద్ధమే

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ**


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

కొత్తూర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): చేయూత పింఛన్ల పెంపు కోసం రేవంత్ సర్కార్‌పై ప్రత్యక్ష యుద్ధం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని జేపీ దర్గా వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్ మాదిగ అధ్యక్షతన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఉపేందర్ హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు దివ్యాంగులకు 6వేల పింఛన్, వృద్ధులు, వితంతవులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులతో పాటు, చేయూత పింఛన్లు రూ.4వేలకు పెంచుతామన్న హామీని విస్మరించారని దుయ్యబట్టారు. ఈ విషయంలో ప్రతిపక్ష పార్టీ నేతలు ప్రభుత్వంపై పోరాడటంలో విఫలమయ్యారని ఆరోపించారు. మందకృష్ణ ముందుకు వచ్చి పింఛన్ దారులకు మద్దతు పలికి పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. పోరాటంలో భాగంగానే ఈనెల 8న చలో కలెక్టరేట్, 12న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 20న హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధం, 21నుంచి 26వరకు గ్రామపంచాయతీల ఎదుట ధర్నా, 27న రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల దిగ్బంధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముసాయిపేట యాదగిరి, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, కోళ్ల శివ, రావుగాళ్ల బాబు, శంకర్‌రావు, పెంటనోళ్ల రవికుమార్, రవి, రమేష్, రామచంద్రయ్య, కృష్ణ, శివశంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న తల్లోజు ఆచారి

ఆమనగల్లు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రజా విశ్వాసం కోల్పోయాయన్నారు. స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీలకు గుణపాఠం తప్పదన్నారు. ఆమనగల్లులోని బీజేపీ కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ బీఆర్ఎస్ నాయకుడు వస్పుల రవీందర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి ఆచారి కండువాలు కప్పారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. కేంద్ర పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకుపోవాలనికోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, నాయకులు చెన్నకేశవులు, కృష్ణయాదవ్, పద్మప్రశాంత్, రవిరాథోడ్, చెక్కాల లక్ష్మణ్, సాయికుమార్, మహేశ్, రవీందర్, లక్ష్మణ్, శ్రీను, వంశీ, రాంకిరణ్, కార్తీక్, ఆనంద్, ప్రవీణ్, గణేశ్ పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌కు మంచి రోజులు


బషీరాబాద్‌లోని మోడల్ స్కూల్ హాస్టల్ భవనం

» బషీరాబాద్ ఆదర్శ పాఠశాలకు రూ.5లక్షలు మంజూరు
» హాస్టల్ అసంపూర్తి పనులకు మోక్షం
» త్వరలో అందుబాటులోకి భవనం


మోడల్ స్కూల్ పరిసరాల్లో చదును చేయిస్తున్న ప్రిన్సిపాల్ అనీల, లెక్చరర్లు

బషీరాబాద్ ,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లోని మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)విద్యార్థులకు మంచి రోజులు రానున్నాయి. మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న హాస్టల్ భవనం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవతో త్వరలోనే అందుబాటులోకి రానుంది. భవనంలోని అసంపూర్తి పనులకు ఎమ్మెల్యే రూ.5లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేయగా పనులు చేస్తున్నారు. 2016లో మోడల్ స్కూల్‌ను మంజూరైంది. పూర్తి సౌకర్యాలు లేకుండానే ప్రారంభించారు. 2019లో రూ.1.28కోట్లు మంజూరు కాగా స్కూల్ పక్కన హాస్టల్‌ను నిర్మించి 2022లో విద్యాశాఖకు అప్పగించారు. ఈ భవనం మూడేళ్లుగా వినియోగంలోకి రాలేదు. అసంపూర్తి పనులు, హాస్టల్ నిర్వహణకు సిబ్బందిని నియమించక నిరుపయోగంగా ఉంది. మోడల్ స్కూల్ విద్యార్థులకు హాస్టల్ లేక దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ స్కూల్‌లో 120మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా హాస్టల్ భవనాన్ని పట్టించుకోక తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. తాగునీరు, కరెంట్ సౌకర్యాలు కల్పించలేదు. భవనం చుట్టూ పొదలు పెరిగాయి.

### ప్రిన్సిపాల్ ప్రత్యేక చొరవతో...

స్కూల్ ప్రిన్సిపాల్ అనీల బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి హాస్టల్ భవన పనులపై వినతిపత్రమిచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ హాస్టల్ భవన పనులకు పూర్తికి డీఎంఎఫ్‌టీ రూ.5లక్షల నిధులు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్ హాస్టల్‌లో గదుల మరమ్మతులు, తలుపులు, కిటికీల కొత్తవి ఏర్పాట చేస్తున్నారు. కరెంట్, నీటి కనెక్షన్ కల్పించి భవనం ఖాళీ స్థలంలో ఫ్లోరింగ్ పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భవన ప్రాంగణంలో పొదాలు, బండరాళ్ల తొలగింపు పనులు చేస్తున్నారు. నెల రోజుల్లో హాస్టల్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేలా ప్రిన్సిపాల్ పనులు చేయిస్తున్నారు.

## లంబాడీలపై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న లంబాడ, గిరిజన సంఘాల నాయకులు

పరిగి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లంబాడీలపై అసత్యప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. లంబాడ,గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం పరిగిలోని కొడంగల్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు, సోయం బాబురావులు లంబాడిలను గిరిజనులను జాబితా నుంచి తొలగించాలని రిట్ దాఖలు చేశారని, ఇది కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకే జరిగిందా? అని ప్రశ్నించారు. వారిని పార్టీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు వినోద్, వీరేందర్, చందు, రమేశ్, బాలకృష్ణ, శంకర్, సందీప్, నవీన్ పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డితో బొంరాస్‌పేట్ కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని బొంరాస్‌పేట్ మండల కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మండల అభివృద్ధితో పాటు అగ్రికల్చర్ యూనివర్సిటీ, హార్టికల్చర్ యూనివర్సిటీ మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు స్పందించిన సీఎం స్థలభావం కారణంగా యూనివర్సిటీ మంజూర్ చేయలేకపోతున్నామని, స్థలం ఉంటే పరిశీలించాలని తెలిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఎంపీడీవో వెంకన్నగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సిములుగౌడ్, వెంకట్రాముల్‌గౌడ్, మల్లికార్జున్, పాల్గొన్నారు.

## టిప్పర్ డ్రైవర్లకు అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ యాదగిరి

దుద్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ డ్రైవర్ల దుద్యాల ఎస్ఐ యాదగిరి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలెపల్లి ఎల్లమ్మ ఆలయ ఆవరణలో గురువారం వివిధ కంపెనీలకు చెందిన టిప్పర్ డ్రైవర్లు 40మందికి అవగాహన కల్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్డు పనుల్లో మట్టిని తరలిస్తున్న టిప్పర్ వాహనాలను రోడ్లపై అతి వేగంగా నడపకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లేశ్, ఇన్‌చార్జి అంజిల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడాకారులకు సహకారం అందిస్తాం



క్రీడాకారులను సన్మానిస్తున్న ఆంజనేయులు

కులకచర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు తమ వంతు సహకారం అందిస్తానని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా చిల్పూర్ స్టేడియంలో గత రెండు రోజుల కిందట జరిగిన అండర్-19 లగోరి నేషనల్ చాంపియన్‌షిప్ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం రెండో బహుమతిని సాధించింది. అందులో ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. క్రీడాకారులను గురువారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జనార్దన్‌రెడ్డి, పాఠశాల చైర్‌పర్సన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం

కీసర/కులకచర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ అధ్వర్యంలో విద్యార్థులకు గురువారం క్రీడా పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక, క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కులకచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీ ఉపాధ్యాయులను పీఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దేవి, రాఘవేందర్‌గౌడ్,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### తిమ్మారెడ్డిపల్లిలో ఘనంగా గురు పూజోత్సవం

నవాబ్‌పేట: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం గురు పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువుల పట్ల తమ కృతజ్ఞతా భావాన్ని వ్యక్తపరుస్తూ ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, ప్రసంగాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు కరుణశ్రీని విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు.

### రేపు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తాండూరు రూరల్: మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించనున్నట్లు మండల విద్యాధికారి వెంటకయ్యగౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరులోని వినాయక కన్వెన్షన్‌లో రేపు(6వ తేదీ శనివారం) అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

## ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ అందజేత

బషీరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దామర్‌చెడ్‌కు చెందిన అర్చనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావు బషీరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం లబ్ధిదారుకు గురువారం ప్రొసీడింగ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సభ్యులు కొవ్వూరు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది కొరత.. సేవలకు వెత!

- తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీలు
- పదోన్నతిపై వెళ్లిన సీనియర్ అసిస్టెంట్
- సెలవులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తాండూరు రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తుంది. తహసీల్దార్ కార్యాలయానికి పట్టణంతోపాటు, మండలంలోని 33పంచాయతీల ప్రజలు రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రోజూ వందల సంఖ్యల్లో వస్తుంటారు. అయితే కార్యాలయంలో ప్రధానంగా పనిచేసే వారు లేకపోవడంతో ప్రజా దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. నిత్యం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం జరగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాండూరు తహసీల్దార్ కార్యాలయం

### తహసీల్దార్ కార్యాలయంలో లేని సిబ్బంది

తాండూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కుమార్ డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతిపై వెళ్లారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి అవినీతి ఆరోపణల నేపథ్యంలో సెలవుపై వెళ్లారు. ఇప్పటికే ఒక ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉండగా, గోపి కూడా అవినీతి ఆరోపణల నేపథ్యంలో సెలవుపై వెళ్లి బదిలీపై వెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. దీంతో సిబ్బంది కొరతతో భారమంతా తహసీల్దార్‌పైనే పడుతుంది. ఉన్న సర్వేయర్ కూడా ప్రజలకు అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**సమస్యలు పరిష్కరిస్తాం**

కార్యాలయంలో ఇద్దరు ఆర్ఐలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఒక ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పట్టణ, మండలం నుంచి రెవెన్యూ దరఖాస్తులు అధికంగా వస్తాయి. ఆర్ఐ గోపి మాత్రమే సెలవుపై వెళ్లారు. ఉన్న సిబ్బందితో ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం.

**- తహసీల్దార్ తారాసింగ్**

# గంగమ్మ ఒడికి గణపయ్య

వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో విశేష పూజలందుకున్న గణపయ్య గురువారం గంగమ్మఒడికి చేరాడు. ఈ సందర్భంగా అధికారులు నిమజ్జన ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు చోట్ల లడ్డూ వేలం, అన్నదానం నిర్వహించారు. మరి కొన్ని మండపాల్లో గణనాథుడికి పూజలు కొనసాగుతున్నాయి.



ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో క్రేన్‌తో వినాయకున్ని నిమజ్జనం చేస్తున్న సిబ్బంది, తిలకిస్తున్న భక్తులు



తాండూరు రూరల్: కరన్‌కోట్ వినాయకుడి వద్ద డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి పూజలు



మేడ్చల్ టౌన్: రాఘవేంద్రనగర్ కాలనీలో గణేశ్ మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేస్తున్న ఏసీపీ శంకర్ రెడ్డి



యాలాల మండలం హాజీపూర్‌లో..



చౌడాపూర్: మందిపాల్‌లో వేలంలో గణేశ్ లడ్డూను దక్కించుకున్న గ్రామస్తుడు



కులకచర్ల: తిరుమలాపూర్‌లో వినాయక నిమజ్జనంలో యువకులు

వికారాబాద్: ఎన్నెపల్లిలోని రూ.81వేలకు గణేశ్ లడ్డూను దక్కించుకున్న మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి





పెద్దేముల్: కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

# దారిమళ్లిన యూరియా!

(మూడో పేజీ తరువాయి)

ప్రజా సంఘాలు వాదిస్తున్నాయి. యూరియా రాయితీని పరిశ్రమలు వాడుకుంటున్నాయని ఆరోపిస్తున్నాయి.

### లారీ పట్టివేత.. శాంపిల్స్ సేకరణ

కేఏ 56 9334 నంబరు గల లారీలో 600 బస్తాల యూరియా ఓ కంపెనీకి తరలిస్తున్నారనే సమాచారంతో బుధవారం అర్ధరాత్రి యూరియా లోడ్‌ను ట్రాక్టర్లకు మారుస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆ లారీని పరిగి పీఎస్‌కు తరలిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని చన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గురువారం వ్యవసాయాధికారులు లక్ష్మీకుమారి, రజిత, సీఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. పట్టుబడిన యూరియా పరిశ్రమలకు మాత్రమే ఉపయోగించేదని ప్రాథమికంగా గుర్తించారు. ఈ యూరియాను లారీల ద్వారా ముంబైలోని నవశివ ఏజెన్సీ నుంచి పరిగి మండలం మాదారంలోని ప్లైవుడ్ కంపెనీకి తరలిస్తున్నట్లు గుర్తించారు. అయితే యూరియా శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ల్యాబ్‌లో పంటలకు వాడే యూరియాగా తేలితే కేసు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

### రాజకీయ ఒత్తిడితో నీరుగార్చే యత్నాలు?

యూరియా అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు, వ్యవసాయాధికారులు దాటవేసే ధోరణి అవలంబిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతస్థాయి రాజకీయ నేతల ఒత్తిళ్లు ఉన్నట్టు ఆరోపిస్తున్నారు. నిమ్‌కోటెడ్ యూరియాను పంటలకు ఉపయోగిస్తారు. పట్టుబడిన యూరియాను ప్లైవుడ్ పాలిమరైజేషన్ కోసం వాడుతుంటారని కొందరు అధికారులు చెబుతున్నారు. రాయితీపై చవకగా లభించే యూరియాను పరిగి,పూడూరు, చేవెళ్ల, మొయినాబాద్ ప్రాంతాల్లో ఎరువుల దుకాణాల ద్వారా సేకరించి ప్యాకింగ్ బ్యాగులను మార్చి తరలిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పట్టుబడిన యూరియా బస్తాలపై ఫర్ ఇండస్ట్రియల్ యూజ్ అని ఉన్నప్పటికీ ఎక్కడి నుంచి వచ్చింది, ఎక్కడ తయారైంది? అనే వివరాలు లేవు. అంతేగాకా యూరియాకు సంబంధించిన పత్రాలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## ఉత్తమ సేవలకు గుర్తింపు

(మూడో పేజీ తరువాయి)

ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించనున్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

ఎ.గౌరీశంకర్(జీహెచ్ఎం- మేకవనంపల్లి), స్కూల్ అసిస్టెంట్లు పి.నర్సిములు(ఇందూరు), కె.లక్ష్మీనరసమ్మ(ధారూరు), కె.కృష్ణయ్య(చెన్‌గోముల్), పి.శ్రీధర్(ఇందూరు), సుమని కుమారి(ఆలంపల్లి ఉర్దూ), కె.ఆరాధన(తాండూరు ఉర్దూ), ఎస్.నర్సిములు(సిరిపురం), ఎం.భారతిదేవి(దాదాపూర్), ఎస్.వెంకటయ్య(అనంతగిరిపల్లి), పి.మధుసూదన్(నస్కల్), పి.శ్రీరాంరెడ్డి(అనంతగిరిపల్లి), బాలమణి(రెడ్డి ఘణాపూర్), ఎ.దయాకర్(పరిగి), ఎ.నాగరాజు(జిన్‌గుర్తి), పి.అరుణ్‌కుమార్(వెల్చాల్), కె.వెంకటయ్య(మన్నెగూడ), ఫిజికల్ డైరెక్టర్లలో ఎం.నారాయణమ్మ(మేకవనంపల్లి), ఆర్.స్వప్న(పరిగి), ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలలో బి.లీలావతి(గౌతాపూర్), కె.బాబ్యా(మల్కాపూర్), పీఈటీల్లో జి.బుగ్గప్ప(జిన్‌గుర్తి) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఎస్జీటీల్లో ఎం.సరిత(నాగసముందర్), కె.బాలు రాథోడ్(దిర్సంపల్లి), పి.భాగ్యలక్ష్మి(మంబాపూర్), సీహెచ్.రవీందర్‌రెడ్డి (పెద్దేముల్), ఎం.ఈశ్వరరావు(కంకల్), కె.సంగమేశ్వర్(పీరంపల్లి), ఎ.శ్రీనివాస్(గొట్టిముక్కుల), వి.రమేష్(కులకచర్ల), బి.శ్రీనివాస్(మోమిన్‌కలాన్), ఎం.సంతోష్‌కుమార్(కొండాపూర్), డి.శేఖర్(సుల్తాన్‌పూర్), పి.వెంకటయ్య(దాదాపూర్), టి.ముస్తాఫా(మీనపల్లి కలాన్), బి.సంతోషమ్మ(పూడూరు), కె.మశ్చేందర్(సిరిపురం), ఆఫ్రీన్ జహన్(ఎకమామిడి), వి.సంధ్యారాణి(ఇబ్రహీంపూర్), ఈ.శ్రీనివాస్(శివారెడ్డిపల్లి), ఎ.కేశవులు(పంచలింగాల్), రేణుక(దౌల్తాబాద్), అఫ్రా సుల్తానా(మన్నెగూడ), సీహెచ్.రాములు(మల్‌రెడ్డిపల్లి), రాధాబాయి(సిరిగిరిపేట్), బి.కిరణ్‌కుమార్(పెద్ద తండా) కె.వీణ(ఇబ్రహీంపూర్)లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. టీజీఎంఎస్‌ల్లో అస్రా నాస్(బషీరాబాద్ -పీజీటీ), రఫతున్నీసా(వికారాబాద్ - సీఆర్‌టీ), ఎం.బాలమణి (సీఆర్‌టీ పీఈటీ - తాండూరు)లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

## బడి ఎదుటే బురద!



బురదమయంగా ప్రాథమిక పాఠశాల ప్రాంగణం

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు పాఠశాల ఆవరణలో నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో విద్యార్థులు తరగతి గదిలోకి వెళ్లాలన్నా బురదలో నడిచి పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలి



టీఎల్ఎం మేళాలో విద్యార్థులు తయారు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న ఎంఈవో హరిలాల్

చౌడాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బోధనోపకరణాలతో విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా బోధించాలని ఎంఈవో రాంచందర్ అన్నారు. మండల కేంద్రంలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి టీఎల్ఎం మేళాను ప్రారంభించారు. రేఖాచిత్రాలు, బొమ్మలు, కాగితాలు, విత్తనాలు వివిధ వస్తువులతో విద్యార్థులు బోధనోపకరణాలు తయారు చేసి ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

**పూడూరు:** మండల కేంద్రంలో టీఎల్ఎం మేళాను ముఖ్యఅతిథి ఎంపీడీవో పాండుతో కలిసి మండల విద్యాధికారి సాయిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మన్నెగూడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రత్న, మండల సిబ్బంది రాఘవేందర్, గాలయ్య, అస్మత్, రమాదేవి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట్:** విద్యార్థులకు టీచింగ్ అండ్ లర్నింగ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళా ఆకట్టుకుంది. గురువారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ ప్రయోగాలు ప్రదర్శించి వివరించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో హరిలాల్ హాజరై విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. మండలంలోని 10 పాఠశాలలను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు.

## సంక్షిప్తంగా..

### ప్రభుత్వం హామీలను అమలు చేస్తోంది

కులకచర్ల: కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. గురువారం కులకచర్లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ ఆనంద్, కాంగ్రెస్ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఘనంగా పోషకాహార వారోత్సవాలు

కులకచర్ల: పిల్లలకు పోషణతో కూడిన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. మండలంలోని కామునిపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాల వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలు, గర్భిణీ మహిళలు, చిన్నారులు పోషకాలు గల మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శైలజరెడ్డి, హెచ్ఎం చంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పర్వత్‌పల్లిలో విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

బషీరాబాద్: పర్వత్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నూలు పంపిణీ చేశారు. స్థానిక మాజీ సర్పంచ్ భర్త నర్సింహులుగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నవీన్‌కుమార్‌గౌడ్ విద్యార్థులకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

### గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలి

కొడంగల్ రూరల్: గొర్రెలు, మేకలకు వచ్చే పారుడు వ్యాధి నివారణకు పెంపకం దారులు విధిగా పీపీఆర్ వ్యాక్సిన్‌ను వేయించాలని ఎరాన్‌పల్లి వెటర్నరీ సబ్‌సెంటర్ జేవీవో వెంకటయ్య అన్నారు. ఖాజాఅహ్మద్‌పల్లిలో 948 గొర్రెలకు, మేకలకు గురువారం పీపీఆర్ వ్యాక్సినేషన్ వేశారు.

## క్రైం కార్నర్

### మహిళ అదృశ్యం



కనుమూరి మహాలక్ష్మి(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎం బాలస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి, నిడదోలుకు చెందిన కనుమూరి మహాలక్ష్మి(43) మూడు నెలల కిందట ఘట్‌కేసర్‌కు చెందిన కడమంచి యాదగిరిని వివాహం చేసుకొని ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఉంటున్నారు. 15 రోజుల నుంచి మేడిపల్లి మండలకేంద్రంలోని ఓ కంపెనీలో పనికి వెళుతోంది. రోజూ మాదిరిగానే ఈనెల 1న పనికోసం వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాలేదు, ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో భర్త తెలిసిన వారిని, బంధువులను, మిత్రులను విచారించినా ఫలితం లేదు. గురువారం సాయంత్రం ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### అక్రమంగా ఇసుక నిల్వచేసిన వ్యక్తిపై కేసు

ధారూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు. కుమ్మరిపల్లికి చెందిన మూడవత్ రవికుమార్ కాగ్నా నది కాలువలో నుంచి ఇసుకను తవ్వి శ్మశానవాటిక పక్కన నిల్వ చేశాడు. దాదాపు 30 నుంచి 40 ట్రాక్టర్ల ఇసుకను అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ చేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్వప్న ఫిర్యాదు ఆధారంగా రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## జీపీవోలు వచ్చేస్తున్నారు

(మూడో పేజీ తరువాయి)

వికారాబాద్ జిల్లాకు రానున్నారు. 236 క్లస్టర్లలో 163 క్లస్టర్లకు సంబంధించిన జీపీవోలు నేడు నియామక పత్రాలు తీసుకోనుండగా, వారికి క్లస్టర్లను కేటాయించిన తర్వాత మిగతా 73 ఖాళీలను ఇంతకుముందు వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసి ప్రస్తుతం జూనియర్, రికార్డు అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న వారితో భర్తీ చేయనున్నట్లు తెలిసింది. జీపీవోలకు సెప్టెంబరు రెండో వారంలో పోస్టింగులు ఇచ్చే అవకాశం ఉంది. మెరిట్, కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా నియామకాలు చేపట్టనున్నారు. నియామకాల్లో దివ్యాంగులు, స్పౌజ్, ఒంటరి మహిళలు, అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కాగా, సొంత మండలం, నియోజకవర్గంలో పోస్టింగులు ఇవ్వరాదనే నిబంధన విధించారు.

### వీఆర్వోలు, వీఆర్ఏల సర్దుబాటుతో ఇబ్బందులు

కేసీఆర్ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్వోలు), గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ)లను రెవెన్యూ విధుల్లో నుంచి తప్పించి వారిని విద్యార్హతల ఆధారంగా ఇతర శాఖలకు సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 197 మంది వీఆర్వోలు, 800 మంది వీఆర్ఏలు ఉండగా, వారిలో విద్యార్హతల ఆధారంగా విధులు కేటాయించారు. వీఆర్వో, వీఆర్ఏల కొరతతో భూ, రెవెన్యూ రికార్డుల నిర్వహణ కత్తిమీద సాములా మారడం వల్ల రెవెన్యూ సంఘాల విజ్ఞప్తితో ప్రభుత్వం జీపీవోల అంశం తెర మీదకు వచ్చింది. గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తూనే.. డిగ్రీ, ఐదేళ్ల సర్వీసుతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతను అర్హతగా నిర్ణయించిన విషయం తెలిసిందే.

### 'భూ భారతి'లో కీలకం

కొత్తగా బాధ్యతలు తీసుకోనున్న జీపీవోలు పూర్వ వీఆర్వో, వీఆర్ఏ విధులతోపాటు భూభారతి రెవెన్యూ సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత కారణంగా రెవెన్యూ సమస్యలు, అర్జీల పరిష్కారం ప్రస్తుతం నత్తనడకన సాగుతోంది.

## తాగునీటి బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఏదీ?



ధారూరు: మోమిన్‌కుర్దులో విద్యుత్ కనెక్షన్ ఇవ్వని బోరు

ధారూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌కుర్దులోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ఏర్పాటు చేసిన తాగునీటి బోర్లకు విద్యుత్ కనెక్షన్ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టీకర్ చొరవతో గ్రామంలోని ఎస్సీ కాలనీలో గంగారం నర్సింహులు ఇంటి సమీపంలో, బీసీ కాలనీలోని ఈడ్గి రాములు ఇంటి వద్ద ఉన్న బోర్లకు సింగిల్ పేస్ విద్యుత్ మోటార్లు, స్టార్టర్లను గత నెలలో బిగించారు. ఈ బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వక మోటార్లు నడవక తాగునీరు బయటకు రావటం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## జీవన్గి పల్లె దవాఖానాలో వైద్యశిబిరం



జీవన్గి పల్లె దవాఖానాలో వైద్య బృందం

బషీరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జీవన్గి బర్కాలోని పల్లె దవాఖానాలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. నవాల్గ పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్, అనిత, దుర్గ, మౌనిక, సిబ్బంది హాజరై ప్రజలకు వైద్య పరీక్షలు జరిపారు. వైద్యులు శ్రీకాంత్ రక్తపోటు, హెచ్ఐవీ, హోల్డ్ టీబీ, మధుమేహం, వంటి వ్యాధులకు సంబంధించి పరీక్షలు జరిపారు. టీబీ లక్షణాలు ఉన్న రోగులు ఎవరూ బయపడాల్సిన పనిలేదని, వైద్యుల సూచన మేరకు సమయానికి మందులు వాడితే పూర్తిగా తగ్గిపోతుందన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

దుద్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, ఖాజామీయ, శ్రీశైలం గౌడ్, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## దుద్యాలలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

కొడంగల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన దుద్యాల మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు సురేశ్‌రాజ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చొరవతో దుద్యాల మండల కేంద్రంగా ఏర్పడిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ మండలంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం సరికాదన్నారు.

## కేజీబీవీలో బోరు ఏర్పాటు

తాండూరు రూరల్, సెప్టెంబరు 4, (ఆంధ్రజ్యోతి) ఐనెల్లి శివారులోని కేజీబీవీ పాఠశాల, కళాశాలలో నీటి సౌకర్యార్థం బోరును ఏర్పాటు చేశారు. ఏఎస్ఐఏ బ్రో బ్లీచ్ కంపెనీ జనరల్ మేనేజర్ కమలేష్, భరత్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి పనులను చేపట్టారు. పాఠశాల ప్రత్యేకాధికారిణి ఆశలత, సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.